# ప్రాప్తం

- టి.రామాంజనేయులు



"శుక్రవారం ఉదయం 10 గంటలకు దివ్యమైన ముహూర్తముంది వెంకటేశా. ఆ సమయంలో నిశ్చితార్థం జరిగిందంటే వారి దాంపత్య జీవితం మూడుపువ్వులు ఆరుకాయలుగా వుంటుంది వెంకటేశా. ఇదీ సంగతి వెంకటేశా'' అన్నారు అవధాని గారు.

ఫణిభూషణరావుతో అన్నిటిలోనూ సన్నిహితంగా వుండే వ్యక్తి శేషగిరిరావు. ఒక్కతే కూతురు. శేషగిరిరావుతో వియ్యమందాలనుకున్నాడు ఫణిభూషణరావు. కానీ అందుకు ససేమిరా అన్నాడు కొడుకు వినాయకరావు.

"ఒరేయ్ భూషణం! ప్రాప్తమున్న చోట ఫలమేల తప్పురా అంటారు. నీతో వియ్యమందే ప్రాప్తం నాకు లేదు. నీవేం వర్రీ అవకు. టేకిట్ ఈజీ'' అన్నాడు శేషగిరిరావు.

అనుకోకుండా వినాయకరావు పెళ్ళి ఖాయమైంది.

అమ్మాయి బాగుంది. సంప్రదాయమైన కుటుంబం. పైగా కొడుక్కి అమ్మాయి బాగా నచ్చింది. అందుకే వూరు దూరమైనా ఆ అమ్మాయిని తన కోడలిగా తెచ్చుకోవాలనుకున్నాడు ఫణిభూషణరావు.

తెల్లవారుఝామున రెండు గంటలకే ప్రయాణం. అప్పుడు బయలుదేరితేనే కానీ అనుకున్న సమయానికి వూరు చేరుకోలేరు. కావలసినవన్ని ముందు రోజే సర్దుకున్నారు.

"అసలే కరువుకాలం. పరిస్థితులు బాగాలేవు. మీరెవరు సొమ్ములు వేసుకోవద్దు. కావలసిన నగలన్నీ ఒక బ్రీఫ్‌కేస్‌లో సర్దండి. ఊరు చేరిన తరువాత వేషాలు వేద్దురుగాని'' అన్నాడు ఫణిభూషణరావు.

అయ్యగారి మాటకు తిరుగులేదు. కావలసిన ఆభరణాలన్నీ ఒక బ్రీఫ్‌కేస్‌లో వుంచుకున్నారు. బట్టలన్నీ ఒక సూట్‌కేస్‌లో సర్దారు.

"ఈ సూట్‌కేస్ వెనుక డిక్కీలో వుంచేద్దామండి'' అంది ఫణిభూషణరావు భార్య.

"ఉన్నది నలుగురం. ఈమాత్రం దానికి అక్కడొకటి ఇక్కడొకటీనా. నా దగ్గరే ఉంచుకుంటాను. మీరెవరూ కష్టపడవద్దు'' అన్నారు ఫణిభూషణరావు.

"మొండిమనిషి. ఒకరు చెప్పింది వినే రకమా?'' మూతి మూడువంకర్లు తిప్పింది భార్య.

కారు బయలుదేరింది.

కారు తలుపులు ఎంత మూసిన చలివేస్తోంది. పైగా తెల్లవారుఝామున ప్రయాణం. రాత్రంతా సరిగ్గా నిద్రలేదు. అందరూ గాఢంగా నిద్రమత్తులో తూగుతున్నారు.

సడెన్‌బ్రేక్‌తో కారు ఆగింది. అందరూ ఉలిక్కిపడి లేచారు.

"రోడ్డుకు అడ్డంగా ఎవరో పడున్నారయ్యా'' అన్నాడు డ్రైవర్.

"ఎవరి గొడవలో మనకెందుకులేవయ్యా. సైడు తీసుకుని వెళ్ళు'' సలహా ఇచ్చాడు ఫణిభూషణరావు. కారును ప్రక్కకు తిప్పబోయాడు డ్రైవర్. ఇంతలో...

"ఆపండి. కారు ముందుకు పోనిచ్చారో అందరి ప్రాణాలు తీస్తాం'' అరుస్తూ రోడ్డు పక్కనున్న పొదల చాటునుండి కారుకు అడ్డంగా వచ్చారు కొంతమంది ముసుగు మనుషులు. అంతవరకూ రోడ్డుకడ్డంగా పడుకున్నవాడు లేచి వారిలో చేరాడు. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా అందరికీ ప్రమాదం. ముసుగు మనుషుల చేతుల్లో మారణాయుధాలు సిద్ధంగా ఉన్నాయి. కారు ఆపాడు డ్రైవరు.

కారులో నలుగురున్నా ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితి. తన ప్రక్కనే వుంచుకున్న ఆభరణాలున్న బ్రీఫ్‌కేసును అందించాడు ఫణిభూషణరావు.

సరిగ్గా అప్పుడే...

సైరన్ మోగిస్తూ అటువైపు దూసుకొచ్చింది పోలీస్ వ్యాను. క్షణాల్లో పొదల చాటుకు తప్పుకున్నారు ముసుగు మనుషులు. రోడ్డుకడ్డంగా పడుకున్నవాడు మాత్రం డ్రైవర్‌కు తుపాకి గురిపెట్టి ఏదో మాట్లాడుతున్నట్టుగా నటించసాగాడు.

"అక్కడ కారెందుకు ఆపారు?'' అని ఏమాత్రం చూడకుండా స్పీడుగా ముందుకు వెళ్లిపోయింది పోలీసు వ్యాను.

వెంటనే ముసుగు మనుషులు ప్రత్యక్షమయ్యారు. ఫణిభూషణరావు దగ్గరున్న సూట్‌కేసును లాక్కుని చీకట్లో మాయమయ్యారు.

'హమ్మయ్య గండం గడిచింది' అనుకుంటూ కారును ముందుకురికించాడు డ్రైవరు.

జరిగిన సంఘటన నుండి అందరూ తేరుకునేలోగానే కారు చాలా దూరం వచ్చేసింది.

"నగలు పోతే పోయాయి. ప్రాణాలతో బయటపడ్డాం'' అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

"డాడీ! మీ ప్రక్కనున్న బ్రీఫ్‌కేస్'' అంటూ ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసాడు వినాయకరావు.

అప్పుడు గమనించాడు ఫణిభూషణరావు.

హడావిడిలో దొంగలు నగలున్న బ్రీఫ్‌కేసును వదిలి బట్టలున్న సూట్‌కేసును తీసుకుపోయారు.

చేతికి తీసుకున్న బ్రీఫ్‌కేసును తిరిగి కారులో ఉంచడం దాన్ని వదిలేసి బట్టలున్న సూట్‌కేసును తీసుకుపోవడం... తలచుకుంటే దేవుని లీలలు ఎంత చిత్రంగా ఉంటాయో అన్పిస్తోంది. 'ప్రాప్తమున్న చోట ఫలమేల తప్పురా' అనే మిత్రుని మాట గుర్తుకొచ్చింది. నిజమే ఆ దొంగలకు ప్రాప్తం లేదు మరి.

★